క్లుప్తంగా

ఈద్గాలో పిచ్చి మొక్కల తొలగింపు



రేణిగుంట: రంజాన్ పండుగ సమీపిస్తున్న తరుణంలో మంగళవారం రేణిగుంట బాలికోన్నత పాఠశాల సమీపంలో ఉన్న ఈద్గాలో పిచ్చి మొక్కలను తొలగించారు. ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేసుకునే ఈద్గాలో ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పట్టణంలోని ముస్లిం మతపెద్దలు సమస్యను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్, సర్పంచ్ నగేషం జేసీబీ సాయంతో మొక్కలు తొలగించి ఈద్గాను శుభ్రపరిచారు.

కళాకారులకు సత్కారం



కళాకారులను సన్మానిస్తున్న ఫరీద్‌బాబా

రేణిగుంట: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం రేణిగుంటలో జబ్బార్ ట్రస్ట్ అధినేత షేక్ ఫరీద్‌బాబా 12 మంది రంగస్థల నటులను సన్మానించారు. 100 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. రంగస్థల నటులు జంగం ధర్మారావు, వాసు, నరకేసరి, గుల్జార్ గౌస్, షేక్ ఖాదర్‌వలీ, నందకుమార్, రామకృష్ణ, మస్తాన్, ఆషా తదితరులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన పసల కుమారస్వామి దంపతులు రూ.16,101 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. కోళ్లూరు హరినాథ్‌నాయుడు, నరసింహులు ఉన్నారు.

ముత్యాలమ్మ ఆలయానికి బీరువా వితరణ



బీరువా అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: ముత్యాలమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన వల్లెమ్మ కుమారులు మునికుమార్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి మంగళవారం బీరువాను వితరణ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.


కాలువల్లో పూడిక తొలగింపు



కాలువలో పూడిక తొలగిస్తున్న కార్మికులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీపీ అగ్రహారం టర్నింగ్‌లో మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్ ఆదేశాల మేరకు కాలువల్లో పూడిక తొలగించారు. కాలువల్లో మురుగు నిల్వ చేరడంతో దోమలకు ఆవాసంగా మారింది. కాలువల్లో ప్లాస్టిక్ కాగితాలు, కవర్లు, బాటిల్స్ వేయడంతో అవి అడ్డుతగిలి మురుగునీటి ప్రవాహం నిలిచిపోయింది. స్పందించిన కమిషనర్ పారిశుధ్య కార్మికులతో పూడిక తీయించారు.

బహిరంగ సభను విజయవంతం చేద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గురవయ్య

ఏర్పేడు: బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై ఈ నెల 20న శ్రీకాళహస్తిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య కోరారు. మంగళవారం మండలంలోని కోబాక ఎస్సీ కాలనీలో బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు తులసి రాజన్, మల్లిఖార్జున్, తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా సంతోషం

- సుబ్బానాయుడుకండ్రిగలో గడపగడపకు మన ప్రభుత్వం
- ప్రభుత్వ పాలనపై హర్షం వ్యక్తం చేసిన ప్రజలు
- సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడుకండ్రిగ సచివాలయం పరిధిలోని సుబ్బానాయుడుకండ్రిగ, కోదండరామాపురం పంచాయతీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. సుమారు 350 గడపలకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగనన్న అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి సంబంధించిన నగదు నేరుగా తమ ఖాతాలోకే జమ అవుతోందని స్థానికులు ఎమ్మెల్యే వద్ద తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. గతంలో ఏ సంక్షేమ పథకం రావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని.. ఇప్పుడు పథకాలే తమ గడప వద్దకు వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రభుత్వం కలకాలం ఉండాలని ఆశీర్వదించారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

సుబ్బానాయుడుకండ్రిగలో రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని దళితకాలనీ మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సమస్య ఉందని.. రెండు బోర్లు ఏర్పాటు చేయాలని కోరారు. సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. కోదండరామాపురంలో శ్మశానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని మరమ్మతులు చేయాలన్నారు. కర్మక్రియల మండపం, దేవాలయం నిర్మించాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

సేవచేస్తూనే ఉంటా

ప్రజల ఆశీస్సులు, అండదండలు ఉన్నంత కాలం సేవ చేస్తూనే ఉంటానని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు సక్రమంగా అందుతున్నాయని లబ్ధిదారులు చెప్పడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన కార్యాలయానికి వచ్చి తెలియజేయవచ్చని చెప్పారు. నిరుపేదలు మృతి చెందితే నేరుగా వారి ఇంటికి వెళ్లి అంత్యక్రియలకు రూ.10 వేలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ బత్రి సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఓడూరు గిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పల్లమాల గోవిందరెడ్డి, సర్పంచ్‌లు సుబ్బమ్మ, రామిరెడ్డి, పోలంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు జయకృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, శంకరయ్య, సుబ్రమణ్యం, సుందరామిరెడ్డి, రామ్మకృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, చంద్రయ్యయాదవ్, మంగారెడ్డి, శంకర్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, మార్కండేయరెడ్డి, చెంగల్‌రాయల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న మహా కుంభాభిషేకం



మహా కుంభాభిషేకానికి ముస్తాబైన శ్రీ నాగాలమ్మ ఆలయం



ఆలయంలో కొలువైన నాగదేవతల విగ్రహాలు, ఏపుగా పెరుగుతున్న పుట్ట

పిచ్చాటూరు: ఈ నెల 22, 23 తేదీల్లో టీచర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన స్వయంభు శ్రీ నాగాలమ్మ ఆలయంలో కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. టీచర్స్ కాలనీ సమీపంలో ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ పక్కన 1978 నుంచి నాగదేవత స్వయంభుగా వెలసింది. ఇక్కడ ఉన్న ఓ పుట్ట రోజురోజుకు పెరుగుతుండడం విశేషం. టీచర్స్ కాలనీకి చెందిన రిటైర్డ్ టీచర్ గోపాల్ రెడ్డి 2012లో నాగాలమ్మ దేవత ఆలయ నిర్మాణానికి సంకల్పించారు. దాతల విరాళాలతో ఆలయ నిర్మాణాన్ని 90 శాతం పూర్తి కాగా, గోపాల్ రెడ్డి 2021లో చనిపోయారు. అనంతరం మిగిలిన నిర్మాణాలను ఆయన కుమారుడు నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి మరిన్ని నిధులు సేకరించి ఆలయ నిర్మాణ పనులను పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఆలయంలో ఈ నెల 22, 23 తేదీల్లో మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 22న శనివారం గణపతిపూజ, యాగశాల ప్రవేశం, కలశ స్థాపనం, నవగ్ర ప్రతిష్ఠ ఉంటుందన్నారు. 23న ఉదయం 8 గంటలకు మహాకుంభాభిషేకం(మహా సంప్రోక్షణ), మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు పాటకచేరీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సచివాలయ భవన ప్రారంభం రేపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభిస్తారని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. తప్పక మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: పాపానాయుడుపేట వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శ్రీకాళహస్తి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ మోహన కృష్ణ మంగళవారం స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి



ఆలత్తూరు పాఠశాలలో విద్యార్థుల నుంచి జవాబులు రాబడుతున్న ఏఎంఓ శివశంకరయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని పెట్టాలని ఏఎంఓ శివశంకయ్య తెలిపారు. ఆయన మంగళవారం ఆలత్తూరు, బసవన్నగుంట, పట్టాభి గిరిజన కాలనీలలోని ప్రాథమికోన్నత పాఠశాల్లో మధ్యాహ్నం భోజనాన్ని ఆయన పరిశీలించి, భోజనాన్ని రుచి చూశారు. పాఠశాలలోని విద్యార్థులకు ప్రశ్నలు వేసి, జవాబులు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలన్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారమే భోజనం పెట్టాలని తెలిపారు. భోజనశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే ఆర్థిక ప్రగతి

- మహిళలు ఈ ప్రభుత్వంలో ఆర్థిక పురోగతి సాధించారు
- సంక్షేమ పథకాలతో జీవన విధానాల్లో మార్పు
- జగనన్న పాలనలోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు
- ఎమ్మెల్యే ఆదిమూలం



సంక్షేమ లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: జగనన్న ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ద్వారా మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని రాగిగుంట, మర్రిగుంట గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వ పథకాల్లో వారు పొందిన లబ్ధిని వివరించారు. ప్రతి ఇంటికీ మా భవిష్యత్ నువ్వే జగనన్న స్టిక్కర్లను అంటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ప్రతి ఇంటి వద్ద ఎమ్మెల్యేకి లబ్ధిదారుల నుంచి ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా రాగిగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రజల సమస్యలపై వినతులను స్వీకరించారు. ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్ల జగనన్న పాలనలో నవరత్నాల ద్వారా గ్రామంలోని సుమారు 211 కుటుంబాలకు గానూ రూ.8.67 కోట్ల వరకు చేకూరిన లబ్ధిని సంక్షేమ బుక్‌లెట్ ద్వారా లబ్ధిదారులకు వివరించారు.

సమస్యలు పరిష్కారం..

కార్యక్రమంలో భాగంగా గ్రామంలో డ్రైనేజీ, మురుగు కాలువలు ఏర్పాటు చేసి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరితగతిన డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని, అంతవరకు గ్రామంలో విధిగా పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని ఎంపీడీఓ రామచంద్రను ఆదేశించారు.

గర్భిణులకు దీవెనలు

రాగిగుంట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం సందర్శించారు. బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సంపూర్ణ పోషణ కిట్లను అందించి వారిని దీవించారు.

మద్యంషాపు తొలగించండి

రాగిగుంట కూడలిలో ఉన్న మద్యంషాపును తొలగించాలని స్థానిక మహిళలు ఎమ్మెల్యే ఆదిమూలం వద్ద మొర పెట్టుకున్నారు. మద్యంషాపు ఏర్పాటైనప్పటి నుంచి స్థానికంగా అల్లర్లు మితిమీరాయని వాపోయారు. మద్యం దుకాణానికి వచ్చిన మద్యంబాబులు ఎదురుగా ఉన్న కరకట్టపై మద్యం సేవించి, రాత్రిళ్లు ఇళ్లలోకి చొరబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి ఇక్కడ మద్యంషాపును తొలగించి వేరేచోటుకు మార్చాలని మహిళలు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, స్థానిక ఎంపీటీసీ బొబ్బిలి వసంత, సర్పంచ్ పావని, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ తేరణి, ధనుంజయరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు సుబ్బరామనాయుడు, శాస్త్రిరాజు, నందకుమార్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు లాల్‌బాబు యాదవ్, బిల్లు నరేష్‌యాదవ్, ఎంపీటీసీలు మూర్తి సుబ్బన్న, తహసీల్దార్ ద్వారకానాథ రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిదీ ఒకే మాట..

పిచ్చాటూరు: గ్రామాల్లో ప్రజలు 'మా నమ్మకం నువ్వే జగన్' అని నినదిస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం ఉదయం మండలంలోని శేషంపేట గ్రామంలో ×జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్× కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులతో కలిసి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ, మొబైల్ ఫోన్లకు జగనన్న స్టిక్కర్‌లను అతికించారు. పీపుల్స్ సర్వే నిర్వహించి పార్టీ సూచించిన మొబైల్ నంబర్‌కు మిస్డ్ కాల్ చేశారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ, పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే జగనన్నను 2024లో మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి, నాయకులు మోహన్, శరవణన్, రవి, చిరంజీవి, నారాయణ, రాజేష్, రాము పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం



వరదయ్యపాళెం: ప్రసంగిస్తున్న సీపీఐ, సీపీఎం జిల్లా నాయకులు

వరదయ్యపాళెం: కేంద్రంలో భారతీయ జనతా పార్టీని, ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దింపే రోజులు దగ్గర పడ్డాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు సీపీఐ, సీపీఎం పార్టీలు తలపెట్టిన ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం వరదయ్యపాళెం మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ పాలనను ప్రజలకు వివరించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ప్రజలను ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ 9 ఏళ్లుగా దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్పొరేట్ యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరిస్తోందన్నారు. ఆదానీ, అంబానీలకు కారుచౌకగా దేశ సంపదను కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. సీపీఐ, సీపీఎం పార్టీలు తలపెట్టిన మోదీ హటావో దేశ్‌కో బచావో కార్యక్రమానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనార్దన్, చిన్నిరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, పార్టీ నాయకులు రమేష్, నాగరాజు, రమణయ్య, తరుణ్, సిద్ధలయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిక్నిక్‌లో విషాదం



మృతిచెందిన జయమణికుమార్

నారాయణవనం: సరదాగా పిక్నిక్‌కు వచ్చి తిరుగు ప్రయాణంలో ఆటో నుంచి జారిపడి విద్యార్థి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన నారాయణవనంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ఈ ప్రమాదంలో నగరి మండలం, పుదుపేట ఇందిరానగర్‌కు చెందిన జయమణికుమార్(8) మృతి చెందాడు. ఎస్ఐ పరమేశ్‌నాయక్ కథనం మేరకు.. నగరి మండలం, పుదుపేట ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి విద్యార్థులు మండలంలోని కై లాసనాథ కోనకు ఆటోలో మంగళవారం ఉదయం పిక్నిక్ వచ్చారు. తిరుగుప్రయాణంలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆటో నారాయణవనం బైపాస్‌లోని సముదాయం క్రాస్ వద్దకు చేరింది. అదే సమయంలో ఆటో డ్రైవర్ పక్కన కూర్చొని ఉన్న నాలుగో తరగతి విద్యార్థి జయమణికుమార్ ఆటో నుంచి జారి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. మృతదేహానికి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

చిత్రకారుడు కుటుంబానికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కళాకారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నక్క హరిజనవాడకు చెందిన పెనుమల ప్రసాద్ అనే చిత్రకారుడు మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిత్రకారుల సంఘం సభ్యులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు స్వర్ణమూర్తి, అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి వేమాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సమస్యలు పరిష్కారం



గోపాలరావు కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్



సంతవేలూరులో బోరు మోటారుకు విద్యుత్

వరదయ్యపాళెం: మండలంలోని గోపాలరావుకాలనీ, సంతవేలూరులో నెలకొన్న విద్యుత్ సమస్యలకు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో పరిష్కారమయ్యాయి. ఇటీవల వరదయ్యపాళెం పంచాయతీ గోపాలరావుకాలనీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేతికందే ఎత్తులో రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు మార్పు చేయాలని స్థానిక ప్రజలు విన్నవించారు. అలాగే సంతవేలూరులో సైతం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించగా తక్షణమే అక్కడ నూతన బోరును వేయించారు. నీరు పుష్కలంగా పడ్డాయి. దీంతో ఊరు బయట ఏర్పాటు చేసిన బోరు మోటారుకు అదనపు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని అక్కడ స్థానిక ప్రజలు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే సంబంధిత 2 గ్రామాల్లో పనులు పూర్తి చేయాలని విద్యుత్‌శాఖ నాగలాపురం ఏడీ చంద్రానాయక్, మండల ఏఈ శివప్రసాద్‌ను ఆదేశించారు. గత 2 రోజులుగా యుద్ధ ప్రాతిపదికన విద్యుత్‌శాఖ అధికారులు శ్రమించి గోపాలరావుకాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు మార్చడంతో పాటు సంతవేలూరులో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు మోటారుకు ప్రత్యేక లైను నిర్మాణం చేసి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. ఎమ్మెల్యే చొరవ పట్ల 2 గ్రామాల ప్రజలు అభినందనలు తెలిపారు. తక్షణమే స్పందించిన ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పొయ్యి పంచాయతీ పరిధిలోని పొయ్యి కొత్తూరులో 'పైప్‌లైన్ లీకేజీకి అడ్డుకట్ట వేయరా' అనే కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. మంగళవారం పంచాయతీ సిబ్బంది లీకేజీ అవుతున్న పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేయించారు. తాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని సదాశివపురంలో మృతుడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి మంగళవారం ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి చెందిన ఆనందం మునికృష్ణయ్య(50) అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచన మేరకు గున్నేరి కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాలకు రూ.10 వేలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్ రాజు, భాస్కర్, వెంకటేశ్వర్లు, నాగరాజురెడ్డి, గోపి రెడ్డి, రవిరెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

భగవద్గీతతో సన్మార్గం



ఎమ్మెల్యేకు భగవద్గీత అందజేస్తున్న మునికృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి: భగవద్గీతతో సన్మార్గం సాధ్యమని.. ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు మునికృష్ణారెడ్డి భగవద్గీత మహాగ్రంథాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు సనాతన ధర్మాన్ని తెలుపుతాయన్నారు. ప్రతి ఒక్కరికి భగవద్గీతను అందజేస్తున్న మునికృష్ణారెడ్డిని అభినందించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



కేంద్ర మంత్రి దేవ్‌సిన్హ్‌చౌహాన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అంజూరు



సినీ నటుడు విశ్వక్‌సేన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో కేంద్ర సమచార, ప్రసారాల శాఖ సహాయమంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్, సినీహీరో విశ్వక్‌సేన్ ఉన్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, కండ్రిగ ఉమ, కిట్టు, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు ఆర్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సత్యవేడు: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది మంగళవారం స్థానిక దాస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల వద్ద విన్యాసాలు చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించే విధానం, గ్యాస్ లీకేజీ, కార్బన్‌డయాక్సైడ్ ఉపయోగించే పద్ధతి, ప్రమాదంలో గాయపడిన వారిని రక్షించే పద్ధతులపై విన్యాసాలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.